మరోసారి వైఎస్సార్ సీపీని ఆశీర్వదించండి

- ఎంపీ శ్రీధర్, ఎమ్మెల్యే ఎలీజా విజ్ఞప్తి
- ధర్మాజీగూడెంలో ఉత్సాహంగా గడపగడపకు మన ప్రభుత్వం


ధర్మాజీగూడెంలో సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందిస్తున్న ఎంపీ శ్రీధర్, ఎమ్మెల్యే ఎలీజా

లింగపాలెం : మూడున్నరేళ్లగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో జరిగిన అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి రానున్న ఎన్నికల్లో మరోసారి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని ఎంపీ కోటగిరి శ్రీధర్, చింతలపూడి ఎమ్మెల్యే ఎలీజా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. లింగపాలెం మండలం ధర్మాజీగూడెంలో బుధవారం ఉత్సాహంగా సాగిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. సర్పంచ్ కొత్తూరి మౌనిక, పార్టీనాయకులతో కలసి ఎంపీ శ్రీధర్, ఎమ్మెల్యే ఎలీజా గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ఏమైనా సమస్యలు ఉన్నాయా, ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందుతున్నాయా, ప్రభుత్వ పథకాలకు ఇంకా ఎవరైనా అర్హులు ఉన్నారా.. అన్న విషయాలను నేరుగా ప్రజలను అడిగి తెలుసుకున్నారు. మూడున్నరేళ్లగా ప్రభుత్వ పాలనలో ప్రజలకు అందించిన లబ్ధిని వివరించి కరపత్రాలు అందజేశారు. స్థానికులు పలు సమస్యలను ఎంపీ, ఎమ్మెల్యేల దృష్టికి తీసుకురాగా వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి గడపకూ సంక్షేమ ఫలాలను అందించడమే లక్ష్యంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పాలన సాగిస్తోందన్నారు. వైఎస్ జగన్‌మోహనరెడ్డికి ప్రతి ఒక్కరూ అండగా ఉండాలని కోరారు. ఒకే ఒక్క చాన్స్ ఇవ్వండంటూ టీడీపీ నాయకులు మీవద్దకొస్తే నమొద్దన్నారు. తొలుత జంగారెడ్డిగూడెం నుంచి ర్యాలీగా తరలి వచ్చిన ఎమ్మెల్యే ఎలీజాకు ఆసన్నగూడెంలో పార్టీ నాయకులు పొనగంటి రాము, కుప్పాల రామకృష్ణ ఆధ్వర్యంలో భారీ గజమాల వేసి స్వాగతం పలికారు. అక్కడినుంచి ఎమ్మెల్యే టాప్‌లెస్ వ్యాన్‌పై ప్రజలకు అభివాదం చేస్తూ వేముపల్లి, ముడిచెర్ల, రంగాపురం, కొత్తపల్లి, శింగగూడెం మీదగా లింగపాలెం చేరుకున్నారు. పార్టీ నేత బీవీఎస్ రెడ్డి, ధర్మాజీగూడెం మార్కెట్ యార్డు వద్ద సర్పంచ్ కె.మౌనిక, రమేష్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. అనంతరం ధర్మాజీగూడెం సభావేదిక ఆవరణలో డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి, బాబు జగ్జీవన్‌రావ్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలకు ఎంపీ శ్రీధర్, ఎమ్మెల్యే ఎలీజా పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మట్టా సురేష్, ఎంపీటీసీ మేకల రాజ్యలక్ష్మి, ధర్మాజీగూడెం సొసైటీ చైర్‌పర్సన్ ఉప్పలపాటి వరప్రసాద్, మాజీ ఏఎంసీ చైర్మన్ మండలపు సాయిబాబా, మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ముఖ్యనేత ముసునూరి వెంకటేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షుడు కొఠారి మోహనరావు, పార్టీ నేతలు సొంగా సందీప్, ఇనుంగటి రాజేష్, మేకల రాజు, కొత్తూరి రమేష్, నూతలపాటి శ్రీను, రెడ్డిన శ్రీను, బేతిన మధు పాల్గొన్నారు.


జంగారెడ్డిగూడెంలో వైఎస్సార్ కాంస్య విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ఎలీజా


కామవరపుకోటలో కొత్తూరు బస్టాండ్ వద్ద ర్యాలీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎలీజా

కామవరపుకోట : గడప గడపకు మన ప్రభుత్వం వంద రోజులు పూర్తయిన సందర్భంగా ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా జంగారెడ్డిగూడెంలో చేపట్టిన ర్యాలీ కామవరపుకోట మీదుగా లింగపాలెం మండలం వరకు విజయవంతంగా సాగింది. మండలంలోని పార్టీ నేతలు, అభిమానులు ఈ ర్యాలీ అధిక సంఖ్యలో పాల్గొన్నారు. రావికంపాడు, కామవరపుకోటలో దివంగత నేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎలీజా మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల సంక్షేమమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తూ దేశంలోనే ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. ఇది చూసి ఓర్వలేక ప్రతిపక్ష నాయకులు అనేక కుట్రలు పన్నుతున్నారన్నారు. ఎంతమంది కలిసి వచ్చిన రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ 175 సీట్లు గెలవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ మిడతా రమేష్ బాబు, టౌన్ కన్వీనర్ నానాది సాగర్, రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ డైరెక్టర్ పందు జగదీష్, మండల సచివాలయాల కన్వీనర్ షేక్ మీరా సాహెబ్, టౌన్ సచివాలయాల కన్వీనర్ పందు ప్రసన్న, కరుటూరు బాలస్వామి, రాయంకుల సత్యనారాయణ, వెగ్రి శ్రీను, మారంపూడి సత్యనారాయణ, సీతారాం బాబు, బోట్ల లక్ష్మణ్, ప్రసాద్ రెడ్డి, పార్టీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

100 రోజుల వేడుక

జంగారెడ్డిగూడెం : చింతలపూడి నియోజకవర్గంలో గడపగడపకు మన ప్రభుత్వం బుధవారం నాడు 100 రోజులకు చేరుకుంది. ఈ సందర్భంగా నియోజకవర్గ వ్యాప్తంగా భారీ ర్యాలీ నిర్వహించారు. జంగారెడ్డిగూడెంలో ఎమ్మెల్యే ఎలీజా ఈ ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. తొలుత స్థానిక గంగానమ్మ గుడి సెంటర్ వద్ద ఉన్న వైఎస్సార్ కాంస్య విగ్రహానికి ఎమ్మెల్యే ఎలీజా పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం గుర్వాయగూడెం మీదుగా కామవరపుకోట, తడికలపూడి, కళ్లచెరువు తదితర ప్రాంతాలమీదుగా లింగపాలెం మండలం ర్యాలీగా వెళ్లారు. కార్యక్రమంలో చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి, వైస్ చైర్మన్‌లు ముప్పిడి అంజి, కంచర్ల వాసవీ రత్నం, జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి, ఎంపీపీ కొదమజ్యోతి, ఉభయగోదావరి జిల్లా బూత్ కమిటీల కన్వీనర్ బీవీఆర్ చౌదరి, ఐసీడీఎస్ రీజనల్ చైర్మన్ వందనపు సాయిబాల పద్మ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మండవల్లి సోంబాబు, పార్టీ పట్టణాధ్యక్షుడు పీపీఎన్ చంద్రరావు, మండలాధ్యక్షుడు వామిశెట్టి హరిబాబు, కౌన్సిలర్‌లు పెద్దెత్తున ర్యాలీగా తరలి వెళ్లారు.

సీపీఎస్ రద్దుచేసి ఓపీఎస్ మంజూరు చేయాలి


ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

జంగారెడ్డిగూడెం : సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ మంజూరు చేయాలని కోరుతూ యూటీఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం ర్యాలీ నిర్వహించారు. స్థానిక జెడ్పీ బాలుర హైస్కూల్ నుంచి 2కే వాక్ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్సీ షేక్ సాబ్జి ప్రారంభించి మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు సీపీఎస్‌ను రద్దుచేయాలని కోరారు. ఈ నెల 3న గన్నవరంలో జరిగే సీపీఎస్ సదస్సుని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏలూరు జిల్లా గౌరవ అధ్యక్షుడు ఎంపీ శ్యాంబాబు, జిల్లా కార్యదర్శి అల్లాడి రాజు, జిల్లా ఆడిట్ కమిటీ మెంబర్ ఎంఏ నబి, మండల అధ్యక్ష కార్యదర్శులు షేక్ తడాహికో, టి. రామకృష్ణ, కొయ్యలగూడెం అధ్యక్షుడు బీవీరావు, గౌరవ అధ్యక్షుడు ఎస్,రమేష్ జంగారెడ్డిగూడెం సీపీఎస్ డివిజన్ కన్వీనర్ ఎస్‌కేఎస్‌ఎం షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాల కన్వీనర్‌గా ఉమ్మడి తేజ


ఉమ్మడి తేజను సన్మానిస్తున్న నాయకులు

టి.నరసాపురం : సచివాలయాలకు కన్వీనర్‌లను, గృహసారథులను నియమించడం శుభపరిణామం అని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ శ్రీనురాజు అన్నారు. టి.నరసాపురం మండల సచివాలయాల కన్వీనర్‌గా నియమితుడైన ఉమ్మడి తేజను టి.నరసాపురం ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం పలువురు నాయకులు సన్మానించారు. ఈ సందర్భంగా శ్రీనురాజు మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరువచేసే ప్రక్రియలో పార్టీ నేతలను భాగస్వాములను చేయడం వలన పార్టీ శ్రేణుల్లో నూతన ఉత్సాహం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో కె.జగ్గవరం సహకార సంఘ చైర్మన్ వాసిరెడ్డి మధు, పామాయిల్ ఓఈఆర్ కమిటీ సభ్యులు తుమ్మూరి శ్రీనివాసరెడ్డి, సర్పంచ్ శివమాధవి, ఎంపీటీసీలు బండి సుబ్బారావు, నులకాని నరసింహారావు, గంధం వెంకటేశ్వరరావు, బాలయ్య, నాయకులు వంటిపల్లి సుబ్రహ్మణ్యం, వెలిది నాగబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్ల యూనియన్ నూతన కమిటీ నియామకం

కుక్కునూరు : అల్లూరి సీతారామరాజు ఆటోడ్రైవర్ల యూనియన్ సమావేశం సత్యనారాయణ అధ్యక్షతన బుధవారం ప్రజాసంఘాల కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా పోచారపు వెంకటేశ్వర్లు, సంపత్తి సత్యనారాయణ, కోశాధికారిగా నిమ్మల శివ, ఉపాధ్యక్షులుగా వేల్పుల దుర్గయ్య, సహాయ కార్యదర్శిగా దార క్రిష్ణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల ప్రధాన కార్యదర్శి యర్నం సాయికిరణ్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రవాణా రంగంపై అనేక రూపాల్లో పన్నులు విధిస్తూ తమ ఆదాయాన్ని పెంచుకుంటున్నాయన్నారు. కాని పన్నులు కడుతున్న ఆటో కార్మికులను చలనాల పేరుతో ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రోజురోజుకి పెరిగిపోతున్న నిత్యావసర ధరలతో ఆటో కార్మికులు పూట గడవక ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం వారికి సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఆటోడ్రైవర్లు శనగ రాము, దాసరి మనోజ్, రాయి అశోక్, వై రాజు, ఎస్ పుల్లారావు, పి వెంకన్న, వీరబాబు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

స్థాయిని మరచి విమర్శలు చేయడం తగదు

కుక్కునూరు : ప్రభుత్వంపై, పాలకులపై విమర్శలు చేసేవారు వారి స్థాయి ఏంటో గ్రహించి ఆ తరువాత విమర్శలకు దిగాలని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కుచ్చర్లపాటి నరసింహరాజు అన్నారు. మూడు రాజధానులపై, రాష్ట్ర అభివృద్ధిపై కుక్కునూరు మండల టీడీపీ అధ్యక్షుడు చేసిన విమర్శలపై నరసింహరాజు స్పందించారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ముఖ్యమంత్రిని విమర్శించే స్థాయి టీడీపీ మండల అధ్యక్షుడిది కాదన్నారు. ఒకరిని విమర్శించే ముందు మన స్థాయి ఏంటో తెలుసుకోని విమర్శలు చేస్తే బాగుంటుందని హితవు పలికారు. అభివృద్ధి గురించి టీడీపీ నాయకులు మాట్లాడడం దెయ్యాలు వేదాలు వల్లేసినట్లుందని విమర్శించారు. రాష్ట్రంలో అన్ని ప్రాంతాల అభివృద్ధి కాంక్షించే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మూడు రాజధానుల ఏర్పాటుకు ఆలోచన చేశారన్నారు. అమరావతి రాజధాని కాకుంటే తాము కొన్న భూముల రేట్లు తగ్గుతాయన్న బాధతోనే టీడీపీ నాయకులు గగ్గోలు పెడుతున్నారని దుయ్యబట్టారు. తెలుగుదేశం అధికారంలో ఉండగా చేసిన అభివృద్ధి చూసే రాష్ట్ర ప్రజలు 23 అసెంబ్లీ స్థానాలకు పరిమితం చేశారన్న విషయాన్ని గుర్తించాలన్నారు. విలీన మండలాల్లో పోలవరం పరిహారం విషయంలో గత ప్రభుత్వంలో జరిగిన అక్రమాల కారణంగానే మరలా రీసర్వేలు చేయాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. టీడీపీ అధికారంలో ఉండగా వరదలు వచ్చినప్పుడు చంద్రబాబు ఏ మాత్రం పరిహారం ఇచ్చారో చెప్పాలని సవాల్ విసిరారు. ప్రభుత్వంపై విమర్శలు చేస్తే ప్రజలు చూస్తూ ఊరుకోరని, తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

వరిలో ఎండాకు తెగులు


వరి పొలాలను పరిశీలిస్తున్న ఏలూరు జిల్లా ఏరువాక కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త కె.ఫణికుమార్

జంగారెడ్డిగూడెం : వరిలో ఎండాకు తెగులు, కాండం తొలిచే పురుగు ఉధృతిని గుర్తించినట్లు ఏలూరు జిల్లా ఏరువాక కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త కె.ఫణికుమార్ తెలిపారు. జంగారెడ్డిగూడెంలో బుధవారం క్షేత్రస్థాయిలో వ్యవసాయ అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం జిల్లాలో వరి నాట్లు వేసే దశ నుంచి పిలకలు తొడిగే దశ వరకు ఉందన్నారు. మొక్కలు సరిగా ఎదగకుండా, ఎండిపోయినట్లుగా తమ పర్యటనలో గుర్తించామన్నారు. పై నుంచి కింద వరకు ఎండిపోవడం, ఆకులు వంకరలు తిరిగినటు ఉండటాన్ని బ్యాక్టీరియా ఎండాకు తెగులు అంటామన్నారు. దీని నివారణ కాపర్ హైడ్రాక్సైడ్ 2 గ్రాములు, ప్లాంటామైసిన్ 1 గ్రాము ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. నత్రజని సంబంధిత ఎరువులు (యూరియా) ఒకేసారి కాకుండా దఫదఫాలుగా వేయాలన్నారు. పొటాషియానికి సంబంధించిన ఎరువు మొదటి దఫాగా 20కేజీలు వేయాలన్నారు. అలాగే కొన్ని చోట్ల కాండం తొలిచే పురుగును కూడా గుర్తించామని, దీని వల్ల మొవ్వ చనిపోతుందన్నారు. దీని నివారణకు కార్టాఫ్ హైడ్రోక్లోరైడ్ 2గ్రా లేదా క్లోరాంట్రసిలిప్రోల్ 0.3 మి.లీ ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు.

పంచాయతీ పెండింగ్ బిల్లులు త్వరలోనే చెల్లింపు


రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖమంత్రి బూడి ముత్యాలనాయుడుతో సోమరాజు

కొయ్యలగూడెం : పంచాయతీ పెండింగ్ బిల్లులు మార్చి నెలలో చెల్లిస్తామని ఉప ముఖ్యమంత్రి, రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖామాత్యులు బూడి ముత్యాల నాయుడు పేర్కొన్నట్లు వేదాంతపురం గ్రామ సర్పంచ్ గేలం త్రివిక్రమ సోమరాజు తెలిపారు. అమరావతిలో బుధవారం నిర్వహించిన రాష్ట్ర సర్పంచ్‌ల నియోజకవర్గ ప్రతినిధుల సమావేశంలో పోలవరం నియోజకవర్గం తరఫున తాను ప్రతినిధిగా హాజరైనట్లు చెప్పారు. ఈ సందర్భంగా మంత్రి బిల్లుల చెల్లింపులపై హామీ ఇస్తూ గ్రామాల అభివృద్ధికి నిధుల మంజూరు చేస్తామని తెలిపారన్నారు. మండలంలోని గవరవరం, చొప్పరామన్నగూడెం గ్రామ పంచాయతీలకు ఎన్నికల నిర్వహించడానికి కృషి చేయాల్సిందిగా కోరినట్లు చెప్పారు. అదేవిధంగా వివిధ మండలాలలో స్థిర నివాసం ఏర్పాటు చేసుకున్న పోలవరం నిర్వాసితులకు పూర్తిస్థాయిలో మౌలిక వసతుల కల్పనకు పంచాయతీ ద్వారా కృషి చేయడానికి నిధుల మంజూరుకు కృషి చేయాల్సిందిగా కోరినట్లు తెలిపారు.

పోస్టల్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి


పోస్టల్ సేవలపై ప్రత్యేక శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

పోలవరం రూరల్ : తపాలా శాఖ ద్వారా అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని తపాలాశాఖ కొవ్వూరు అసిస్టెంట్ సూపరింటెండెంట్ కె.శ్రీనివాసరావు అన్నారు. పోలవరం గ్రామంలో బుధవారం పోస్టల్‌శాఖ పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ ప్రారంభించి 140 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ప్రత్యేక క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ పోస్టల్ ద్వారా అందిస్తున్న ఇన్సూరెన్స్ సేవల్లో ఎక్కువ మంది ప్రజలను భాగస్వాములు చేయాలనే లక్ష్యంతో ఈ క్యాంపు నిర్వహించినట్లు చెప్పారు. పోస్టల్ శాఖ ద్వారా అందిస్తున్న ఆర్‌పీఎల్ఐ, ఐపీపీబీ ఆన్‌లైన్ బ్యాంకింగ్, సుకన్య సమృద్ధి యోజన, కార్, బైక్ ఇన్సూరెన్స్‌లు, గ్రూప్ ఆక్సిడెంట్ గార్డ్ పాలసీలను వివరించారు. కార్యక్రమంలో పోలవరం ఎస్‌పీఎం ఎస్.నాగేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

నూకాలమ్మ ఆలయానికి రూ. 25,116 విరాళం


దాతను సత్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

జంగారెడ్డిగూడెం : స్థానిక నూకాలమ్మ ఆలయంలో భీష్మ ఏకాదశి సందర్భంగా బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధానార్చకులు మనోజ్ శర్మ అమ్మవారిని సుందరంగా అలంకరించి హారతులు, కుంకుమ పూజలు, అభిషేకాలు జరిపారు. ఆలయ అభివృద్ధికి కొమ్ముగూడేనికి చెందిన గద్దే పార్థసారథి, దేవీ ప్రసన్న దంపతులు రూ. 25116 విరాళం అందజేశారు. దాత కుటుంబ సభ్యులను అమ్మవారి శేషవస్త్రాలతో ఆలయ కమిటీ చైర్మన్ రాజాన సత్యనారాయణ సత్కరించారు. కార్యక్రమంలో పి.రాము, కె.రామ్మోహన్, ఆర్.నాగేశ్వరరావు, సీహెచ్ లక్ష్మీనారాయణ, ఎన్.నూకరాజు, మహిళలు పాల్గొన్నారు.

ద్వారకాతిరుమలకు పాదయాత్ర


దొరసానిపాడు మీదుగా క్షేత్రానికి వస్తున్న పాదయాత్ర భక్తులు

జంగారెడ్డిగూడెం, ద్వారకాతిరుమల : భీష్మ ఏకాదశి సందర్భంగా జంగారెడ్డిగూడెం మండలం నుంచి ద్వారకాతిరుమలకు హిందూ ధర్మ ప్రచార సమితి నిర్వహించిన పాదయాత్రకు విశేష స్పందన లభించిందని హిందూ ధర్మ ప్రచార సమితి ప్రతినిధి అర్జుల మురళీకృష్ణ తెలిపారు. బుధవారం ఉదయం ప్రారంభమైన ఈ యాత్రకు దాదాపు 8 వేలమంది హాజరయ్యారన్నారు. పాదయాత్రలో భాగంగా మార్గమధ్యలో పలువురు దాతలు వీరికి అల్పాహారాలు ఏర్పాటు చేశారు. జంగారెడ్డిగూడెంలోని పాతబస్టాండు వద్ద తెల్లవారుజామున యాత్ర ప్రారంభించగా ద్వారకాతిరుమల కొండపైన క్షేత్రపాలకుని ఆలయానికి ఉదయం 11 గంటల సమయంలో చేరుకుని, శివదేవుణ్ని దర్శించారు. అనంతరం శ్రీవారి ఆలయానికి చేరుకుని స్వామి, అమ్మవార్లను దర్శించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. హిందూధర్మాన్ని పరిరక్షించే క్రమంలో ఏటా భీష్మ ఏకాదశి పర్వదినాన శ్రీవారి క్షేత్రానికి పాదయాత్రగా వస్తున్నట్లు హిందూధర్మ ప్రచార సమితి సభ్యులు తెలిపారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక

జంగారెడ్డిగూడెం: స్థానిక సీఎస్‌టీఎస్ కళాశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు బేస్ బాల్ అఖిల భారత విశ్వవిద్యాలయ జట్టుకు ఎంపిక అయ్యారు. ప్రిన్సిపాల్ ఎన్.ప్రసాద్‌బాబు మాట్లాడుతూ కాకినాడు పీఆర్ కళాశాలలో జరిగిన అంతర్ కళాశాల బేస్‌బాల్ జట్టు ఎంపికలో ప్రతిభ కనబర్చి వీరు ఎంపికయ్యారన్నారు. వారు గౌహతిలోని అస్సాం రాయల్ గ్లోబల్ యూనివర్సిటీలో ఫిబ్రవరి 14–18 వరకు జరిగే పోటీలలో పాల్గొంటారన్నారు. బేస్ బాల్ అఖిల భారత విశ్వవిద్యాలయ జట్టుకు కె.రాజా, యం.మహేష్, బి.సందీప్ ఎంపికయ్యారు.

క్లుప్తంగా

వలంటీర్ సేవాదృక్పథం


వృద్ధురాలికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ మంగ

బుట్టాయగూడెం : సమయానికి పింఛన్ తీసుకోవడానికి వృద్ధురాలు అందుబాటులో లేకపోవడంతో 25 కిలోమీటర్లు ప్రయాణించి వృద్ధురాలి వద్దకు వెళ్లి పింఛన్ అదంజేసింది ఓ వలంటీర్. వివరాలు ఇలా ఉన్నాయి. రెడ్డిగణపవరానికి చెందిన వాస్తవాయి నారాయణమ్మ అనారోగ్య కారణాలరీత్యా టి.నరసాపురం మండలం బండివారిగూడెంలోని బంధువుల ఇంటి వద్ద ఉంటోంది. విషయం తెలుసుకున్న వలంటీర్ యు.మంగ 25 కిలోమీటర్ల దూరంలోని బండివారిగూడెం వెళ్లి వృద్ధురాలికి పింఛన్ సొమ్ము అందజేసింది.

'జలకళ' రైతన్నలకు వరం

ద్వారకాతిరుమల : వైఎస్సార్ జలకళ పథకం రైతన్నలకు ఒక వరమని తిరుమలంపాలెం ఎంపీటీసీ ఆకుర్తి సత్యన్నారాయణ అన్నారు. గ్రామానికి చెందిన రైతు బొప్పన నరసింహారావు తోటలో జలకళ పథకం కింద మంజూరైన బోరు నిర్మాణానికి బుధవారం శంకుస్థాపన చేశారు. ముందుగా ఎంపీటీసీ సత్యన్నారాయణ, వైఎస్సార్ సీపీ నాయకులు పల్లి ప్రసాద్, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు మిడతా చందు, ప్రభాకర్, గ్రంధిపాముల వెంకటేష్, బొప్పన నరసింహమూర్తి, పందగల శ్రీను, ఏసు కొబ్బరికాయలు కొట్టి పనులను ప్రారంభించారు.

గిరిజన విద్యార్థుల ప్రతిభ

బుట్టాయగూడెం : మండలంలోని కోయరాజమండ్రి గిరిజన సంక్షేమ పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో ఉత్తమ ప్రదర్శన చూపారు. డిసెంబర్ 23 నుంచి 25 వరకు విజయనగరం జిల్లాలో నిర్వహించిన రాష్ట్రస్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌లో 10వ తరగతి విద్యార్థిని మొడియం శిరీష, 9వ తరగతి విద్యార్థి పొట్టోడి ఆశ్రిత శ్రావ్య పాల్గొని తృతీయస్థానం సాధించినట్లు పాఠశాల ఉపాధ్యాయులు తెలిపారు. అలాగే స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కర్నూలులో జనవరి 23 నుంచి 25 వరకు నిర్వహించిన రాష్ట్రస్థాయి అండర్–17 పోటీల్లో 10వ తరగతి విద్యార్థినులు ఎం.శిరీష, కె.మంగతాయారు ప్రతిభను చాటారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

లివర్‌పై శ్రద్ధ అత్యవసరం

కొయ్యలగూడెం : మనిషికి శరీర అవయవాలలోని ముఖ్యభాగాలలో లివర్ ఒకటి అని, నేటి పరిస్థితుల్లో దానిపై శ్రద్ధ అత్యవసరం అని డాక్టర్ నెలకుదుటి లక్ష్మీ లక్ష్మణ్ కుమార్ పేర్కొన్నారు. కన్నాపురం రోడ్‌లోని సన్ రైస్ ల్యాబ్‌లో బుధవారం తెల్ల రేషన్ కార్డుదారులకు 90 శాతం సబ్సిడీపై లివర్ స్కానింగ్ పరీక్షలు నిర్వహించారు. ల్యాబ్ నిర్వాహకులు గెల్లా ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన పరీక్షలకు కొయ్యలగూడెం మండలంతో పాటు బుట్టాయిగూడెం, గోపాలపురం మండలాల నుంచి 200 మందికి పైగా వైద్య సౌకర్యం పొందారు.

శ్మశానవాటిక అభివృద్ధి పనులు ప్రారంభం

టి.నరసాపురం : బొర్రంపాలెం హిందూ శ్మశానవాటిక అభివృద్ధి పనులకు బుధవారం మాజీ ఎంపీపీ కొత్త ప్రకాష్‌బాబు శంకుస్థాపన చేశారు. స్థానికుల సహకారంతో రూ.5 లక్షల అంచనాలతో శ్మశాన వాటికను అభివృద్ధి పరచనున్నట్లు ఆయన తెలిపారు.

ఇఫ్టూ జిల్లా ఉపాధ్యక్షుడిగా రామ్మోహన్

జంగారెడ్డిగూడెం : నిడదవోలులో జరిగిన ఏడవ జిల్లా మహాసభలో ఇఫ్టూ జిల్లా ఉపాధ్యక్షుడిగా నడియం రామ్మోహన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు. రామ్మోహన్ మాట్లాడుతూ కార్మిక వర్గ పోరాటాల బలోపేతానికి, కార్మిక చట్టాల పరిరక్షణకు ఇఫ్టూ ఆధ్వర్యంలో కృషిచేస్తానన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

చింతలపూడి : పెండింగ్ కేసుల పరిష్కారానికి లోక్ అదాలత్ చక్కటి పరిష్కార మార్గమని జూనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయసేవాధికార కమిటీ చైర్మన్ షేక్ ఇబ్రహీం షరీఫ్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక కోర్టు ఆవరణలో సర్కిల్ పరిధిలోని పోలీస్ అధికారులతో జాతీయ లోక్ అదాలత్‌పై సమీక్ష జరిపారు. సమావేశంలో సీఐ ఎంవీఎస్ మల్లేశ్వరరావు, నాలుగు మండలాల ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు. స్థానిక చిల్డ్రన్స్ హోంను జూనియర్ సివిల్ జడ్జి షేక్ ఇబ్రహీం షరీఫ్ సందర్శించి న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. వీధి బాలలు 60 మందిని ఆదరించి భవిష్యత్తు కల్పించడంపై చిల్డ్రన్స్ హోం నిర్వాహకులు హిస్కియను అభినందించారు.

మోడల్ టెస్ట్

జంగారెడ్డిగూడెం : స్థానిక జెడ్పీ బాలుర హైస్కూల్‌లో బుధవారం ఎన్ఎంఎంఎస్ గ్రాండ్ మోడల్ టెస్ట్ నిర్వహించారు. హెచ్ఎం గెడా జగ్గారావు మాట్లాడుతూ 5న జరిగే పరీక్ష నిర్వహణపై విద్యార్థులకు అవగాహన కల్పించే నిమిత్తం స్థానిక సూర్య కళాశాల సహకారంతో మోడల్ టెస్ట్ నిర్వహించినట్లు చెప్పారు. జంగారెడ్డిగూడెం జెడ్పీ హైస్కూల్ నుంచి 79 మంది, తిరుమలాపురం హైస్కూల్ నుంచి 11 మంది విద్యార్థులు ఈ పరీక్షకు హాజరయ్యారన్నారు.

వేగం కన్నా.. ప్రాణం మిన్న



సదస్సులో మాట్లాడుతున్న ఏలూరు ఇన్‌చార్జి డీఎస్పీ పైడేశ్వరరావు

ద్వారకాతిరుమల : ప్రాణం చాలా విలువైందని.. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఏలూరు ఇన్‌చార్జి డీఎస్పీ జీవీఎస్ పైడేశ్వరరావు అన్నారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మండలంలోని సీహెచ్.పోతేపల్లి గోద్రెజ్ ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీలో హెల్మెట్ ధరించడం వల్ల కలిగే ప్రయోజనాలపై బుధవారం కార్మికులకు అవగాహనా సదస్సును నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డీఎస్పీ పైడేశ్వరరావు మాట్లాడుతూ నిత్యం జరిగే రోడ్డు ప్రమాదాల్లో హెల్మెట్ ధరించని ద్విచక్ర వాహనదారులు ఎంతో మంది ప్రాణాలను పోగొట్టుకుంటున్నారని, చిన్నపాటి నిర్లక్ష్యమే ఇందుకు కారణమన్నారు. వేగం కన్నా ప్రాణం ఎంతో విలువైందన్నారు. కార్యక్రమంలో భీమడోలు సీఐ వి.వెంకటేశ్వరరావు, ద్వారకాతిరుమల ఎస్సై టి.సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

చీటింగ్ కేసు నమోదు

జంగారెడ్డిగూడెం : మహిళ ఫిర్యాదు మేరకు చీటింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎం.సాగర్‌బాబు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం కె.గాయిత్రి శ్రీలక్ష్మి, తొమ్మిదేళ్ల రామకృష్ణకు చెందిన ఫ్లాట్స్ అమ్మకానికి ఉన్నాయని తెలిసి అతనిని సంప్రదించింది. లలిత ఎస్టేట్స్‌లో సర్వేనెంబర్ 379/1లో ప్లాట్‌ను శ్రీలక్ష్మికి రిజిస్ట్రేషన్ చేస్తామని చెప్పి రామకృష్ణ సొమ్ములను వారి అకౌంట్‌లో వేయించుకుని రిజిస్ట్రేషన్ చేయించారు. అయితే శ్రీలక్ష్మి ఆ ప్లాట్‌ను అమ్ముకునేందుకు ప్రయత్నించగా, సదరు ప్లాట్ రామకృష్ణ అక్కాచెల్లెళ్ల పేరున రిజిస్టర్ అయినట్లు ఉంది. ఈ క్రమంలో శ్రీలక్ష్మి సదరు ప్లాట్‌ను శుభ్రం చేస్తుండగా రామకృష్ణ మరో 10మందితో కలిసి చంపుతానని బెదిరించాడు. తనను మోసం చేయడమేకాకుండా బెదిరింపులకు పాల్పడిన రామకృష్ణపై చర్యలు తీసుకోవాలని శ్రీలక్ష్మి ఫిర్యాదు చేసింది. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

యువకుడికి గాయాలు

జంగారెడ్డిగూడెం : చికెన్ పకోడి షాపులో పని నేర్చుకుంటుండగా తగరం కార్తీక్ గాయపడ్డాడు. ఎస్సై సాగర్‌బాబు తెలిపిన వివరాలు ప్రకారం కార్తీక చికెన్ షాపులో నూనె మూకిడిని స్టౌపై నుంచి దింపుతుండగా, ప్రమాదవశాత్తు చేతి నుంచి మూకిడి జారి నూనె కాలి మీద పడిందని, ఈ ఘటనలో ఎడమకాలు తొడపై బొబ్బ వచ్చి గాయం అయినట్లు ఆసుపత్రికి నుంచి సమాచారం వచ్చిందన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కేంద్ర బడ్జెట్ కార్పొరేట్‌కే అనుకూలం

ద్వారకాతిరుమల : బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ కామన్ మ్యాన్‌కు వ్యతిరేకంగా.. కార్పొరేట్‌కు అనుకూలంగా ఉందని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.లింగరాజు అన్నారు. కోట్లాది మందికి మేలు చేసే ఐసీడీఎస్, ఉపాధి హామీ, జాతీయ ఆరోగ్యమిషన్, విద్య, ఉపాధి రంగాలకు బడ్జెట్‌లో ఏమాత్రం నిధులు పెంచలేదన్నారు. నిరుద్యోగం, పేదరికం, రైతుల ఆత్మహత్యలు ఆపేందుకు ఎలాంటి చర్యలు లేవన్నారు. బంగారం లాంటి ప్రభుత్వ సంస్థలను అంబానీ, ఆదానీలకు అమ్మడంలో ఉన్న శ్రద్ధ భారతీయులపై లేదన్నారు. ఈ బడ్జెట్‌ను తిరస్కరించాలని, నిరసనలు వ్యక్తం చేయాలని ప్రజలకు ఆయన విజ్ఞప్తి చేశారు.

నాగమణి కుటుంబానికి న్యాయం చేయాలని ఆందోళన

చింతలపూడి : హత్యకు గురైన చింతలపూడికి చెందిన పొట్ల నాగమణి కుటుంబానికి న్యాయం చేయాలని ఎంఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో కుటుంబ సభ్యులు బుధవారం చింతలపూడిలో ఫైర్ స్టేషన్ సెంటర్లో రాస్తారోకో, ధర్నా నిర్వహించారు. మహిళా నాయకురాలు విజయమాదిగ మాట్లాడుతూ భూమి వివాదం పరిష్కరిస్తామని చెప్పి తీసుకువెళ్లి హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. మహిళలపై జరుగుతున్న ఇటువంటి ఘటనలను పునరావృత్తం కాకుండ కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఆందోళనలో మహిళలు, యువకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. సీఐ మల్లేశ్వరరావు ఘటనా స్థలానికి చేరుకుని ఆందోళనకారులతో మాట్లాడారు. బాధితురాలి కుటుంబానికి న్యాయం చేస్తామని, నిందితులను కఠినంగా శిక్షిస్తామని హామీ ఇచ్చారు. కాగా మృతురాలి కుటుంబ సభ్యులు చింతలపూడి విచ్చేసిన ఎస్పీ రాహుల్‌దేవ్ శర్మను కలిసి నిందితులను శిక్షించాలని కోరారు.